# అనంత సాంకేతికం.. అత్యున్నత శిఖరం!



**● ఇదీ పూర్వవిద్యార్థుల మనోగతం ● నేడు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం**

## క్షిపణుల తయారీలో భాగస్వామ్యం



జేఎన్‌టీయూలో నేర్చుకున్న చదువే.. శాస్త్రవేత్తగా ఎదగడానికి దోహదపడింది. టీం వర్కుకు పునాది పడింది. మా స్వగ్రామం నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూర్. మాది వ్యవసాయ కుటుంబం. దేశ సేవలో నావంతు భాగస్వామ్యం అయ్యా. జేఎన్‌టీయూలో 1980-1984 మధ్యన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) పూర్తి చేసి 1986లో డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా చేరా. అక్కడ ఇనర్షియల్ వ్యవస్థలు, నేవిగేషన్ వ్యవస్థలు, ఆల్గోరిథమ్స్ డిజైన్‌లో కీలక భూమిక వహించాను. ఏవియానిక్స్ వ్యవస్థల్లో పలు అధునాతన ఉత్పత్తులను సృష్టించాం. పృథ్వీ, ఆకాష్, బ్రహ్మోస్, అస్త్ర,వీ05, అగ్ని, నిర్భయ్ తాజాగా ఉన్న పలు క్షిపణుల తయారీలో భాగస్వామ్యం అయ్యాను. క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల (మిస్సైల్స్ అండ్ స్ట్రాటిజిక్ సిస్టమ్స్)కు డైరెక్టర్ జనరల్‌గా, రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా పనిచేస్తున్నా.

**- డాక్టర్ సతీష్‌రెడ్డి, క్షిపణులు, వ్యూహాత్మక ఆయుధాల అధిపతి**

**న్యూస్‌టుడే - జేఎన్‌టీయూ**

**ఆదర్శం**


అనంత జేఎన్‌టీయూ సాంకేతికతకు దన్నుగా నిలుస్తోంది.. ఎందరినో తీర్చిదిద్ది భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.. ఇక్కడ చదివిన ఓ కుర్రాడు దేశ రక్షణ పరిశోధన వృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)లో కీలకమైన భూమిక వహిస్తున్నారంటే జేఎన్‌టీయూనే పునాది. అప్పుడే రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.. స్వాతంత్ర్య ఉద్యమం తీవ్రతరమైంది.. ఇక స్వాతంత్ర్య ఫలాలు అందుతాయన్న సంకేతాలు వస్తున్నాయి. . ఇదే సమయంలో ఆంధ్ర ప్రాంతంలో సాంకేతిక విద్యకు తొలి అడుగు పడింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు చిన్న సెలయేరులా తమ ప్రస్థానాన్ని ప్రారంభించాయి. కరవుసీమ అనంతలో 1946లో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ కళాశాల ఆవిర్భవించింది. ఇది కరవు సీమలో కాంతిపుంజంలా మారింది. ఎంతో మంది యువతకు సాంకేతిక విద్యను అందించి.. వారి ఉన్నతికి దోహదపడింది. ఈ కళాశాల దిన దినాభివృద్ధి చెందుతూ.. 2008లో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల అనుబంధంగా సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ)గా రూపాంతరం చెందింది. బుధవారం 8వ స్నాతకోత్సవం జరుపుకుంటోంది. ఇక్కడ విద్యను అభ్యసించిన ఎందరో దేశం గర్వించతగ్గ స్థాయిలో ఉన్నారు. వారంతా తమ కళాశాలను మరువక.. అ'పూర్వ'మైన సహకారం అందిస్తున్నారు. స్నాతకోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూలో చదివి ఉన్నతస్థాయికి చేరిన కొందరి అభిప్రాయాలతో 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం.



ఇటీవల సమావేశమైన పూర్వ విద్యార్థులు

## 14వేల మందికి ఉపాధి


జేఎన్‌టీయూలో ఐదేళ్ల పాటు ఈఈఈ బ్రాంచి పూర్తి చేశా. నాన్న ఇంటి వద్ద వ్యవసాయం చేస్తూ చదివించాడు. ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టంతో కోయంబత్తూరులో ఉద్యోగం చేశాను. ఆతర్వాత రూర్కిలో ఎంటెక్ పూర్తి చేశా. కాకినాడలో మళ్లీ అధ్యాపకునిగా చేరా. అనంతరం అమెరికాలో 18ఏళ్ల పాటు ఉన్నా. ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వదేశానికి తిరిగి వచ్చేశాను. వ్యాపారం చేయాలని, పారిశ్రామిక వేత్తగా ఉండాలని అనుకోలేదు. ప్రజలకు చేరువ కావాలన్న ఉద్దేశంతో ఓ కొత్త టెక్నాలజీతో బ్యాటరీస్ ప్రారంభించా. విజయం అయింది. తమ కంపెనీల్లో సుమారు 14 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగం చేసినా.. వ్యాపారం చేసినా.. మౌలికాంశాలపై పట్టు సాధించింది జేఎన్‌టీయూ కళాశాలలోనే. తాజాగా యువతకు అవకాశాలు అపారంగా ఉన్నాయి. సృజనాత్మకత, సొంతంగా ఆలోచించే విధంగా నేటి తరం తర్ఫీదు పొందాలి. పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకొని జీవితంలో ఇష్టమైన రంగంలో స్థిరపడాలి.



**- గల్లా రామచంద్రనాయుడు, గల్లా గ్రూప్స్ చైర్మన్**


## జన్మభూమి రుణం తీర్చుకున్నా

జేఎన్‌టీయూలో 1958-1963 మధ్య ఇంజినీరింగ్ పూర్తి చేశా. అప్పట్లో ఐదేళ్ల ఇంజినీరింగ్ ఉండేది. జేఈగా, ఈఈగా విధులు నిర్వహించా. 30ఏళ్ల పాటు అనంతలోనే వివిధ హోదాల్లో పని చేసి జన్మభూమి రుణం తీర్చుకున్నా. చెరువుల్లో పూడిక తీయించి నీరు నింపడానికి ప్రాధాన్యం ఇచ్చా. మద్దిలేరు, భైరవానితిప్ప ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగస్వామి అయ్యా. భైరవానితిప్పలో జేఈగా పని చేస్తున్న కాలంలో ఎన్ని నీళ్లు ఉన్నా ఆయకట్టు చివరి వరకు అందకపోవడంతో పంటలు ఎండిపోయేవి. అందుకే వంతుల వారీగా నీరు అందించి పంటలు కాపాడా. జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (అనేకా) పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాం. లైబ్రరీకి రూ.3 లక్షలతో 2013లోనే పుస్తకాలు, ఆరు బ్రాంచిల్లో ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ఏటా రూ.5 వేలు చొప్పున ప్రతిభా ఉపకారవేతనం అందజేస్తున్నాం. ఇటీవలే రూ.10 లక్షలు వెచ్చించి ఆడిటోరియానికి రైటింగ్ కుర్చీలు అందజేశాం. **- శంకర్ రెడ్డి, ఏపీ ఇరిగేషన్ విశ్రాంత ఎస్ఈ**



## సృజనాత్మకతే కొలమానం

జేఎన్‌టీయూలో 1977లో మెకానికల్ పూర్తి చేశా. అప్పట్లో రాష్ట్రంలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. దీంతో రేపల్లె నుంచి అనంతకు వచ్చా. బోధనతో పాటు సొంతంగా ఆలోచించే విధంగా ప్రయోగాలు సాగేవి. బాబా అటామిక్ పరిశోధనా కేంద్రంలో 28 ఏళ్ల పాటు పని చేశా. దేశానికి అవసరమయ్యే ప్రయోగాల్లో భాగస్వామ్యం కావడంతో గర్వంగా ఉంది. 2006-16 మధ్య నిదాని కన్‌స్ట్రక్షన్‌కు ఎండీగా పని చేశా. రక్షణ రంగం, ఇతర నావికా అంశాలకు సంబంధించి స్టీలు తయారీలో సేవలు అందించా. ఇంజినీరింగ్ అనగానే కేవలం ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు అన్న భావన నేటి యువతలో ఉంది. అప్పట్లో ఏవిధమైన అవకాశాలు లేకున్నా ఆ స్థాయికి వెళ్లాం. నేటి యువతరం నేలవిడిచి సాము చేయకూడదు. మొదట మౌలికాంశాల్లో పట్టు సాధిస్తే సృజనాత్మకమైన ఆవిష్కరణలు చేయవచ్చు.



**- నారాయణరావు, నిదాని కన్‌స్ట్రక్షన్ పూర్వపు ఎండీ**

# రైలు కూతకు వేళాయె!

**❒ 30న 'దుర్గం' చేరనున్న రైలు**

**❒ స్టేషన్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు**

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** ఏళ్ల నాటి కల నెరవేరే సమయం ఎప్పుడు? ఎప్పటికి రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గానికి రైలు వస్తుంది? ఈ ప్రాంతానికి పరిశ్రమలు వస్తాయా.. గార్మెంట్ పరిశ్రమలు వెలిసేనా ఇలాంటి అనేక ప్రశ్నలకు పూర్తి స్థాయిలో సమాధానం దొరికింది. రైలు కూతకు వేళ అయింది. ఈనెల 30న కళ్యాణదుర్గానికి రైలు రానుంది. ఈ దిశగా రైల్వే స్టేషన్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతంలో రైలు నడవనుండటంతో నియోజకవర్గం ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వరకు రైలు నడపనున్నారు. 2012 సంవత్సరంలో నాటి ప్రభుత్వం తుంకూర్- రాయదుర్గం రైల్వే లైనుకు భూమి పూజ చేసింది. సుమారు రూ. వెయ్యి కోట్లతో ప్రాజెక్టు పనులు ప్రారంభం అయ్యాయి. 2014 సంవత్సరం నాటికి రాయదుర్గం- కళ్యాణదుర్గం మార్గంలో రైలు తిరగాల్సి ఉండగా ఇప్పటికి ముహూర్తం కుదిరింది. 2015 సంవత్సరానికి కళ్యాణదుర్గం వరకు ట్రైల్‌రన్ నడిచింది. ఆ ఏడాది చివరి నాటికి రైలు కళ్యాణదుర్గం వస్తుందని భావించారు. 2016 సంవత్సరం చివరి నాటికి రైలు మార్గం సుమగమైంది. ఈనెల 30వ తేదీన రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గంకు 40 కిలోమీటర్లు రైలు వస్తుందని రైల్వే వర్గాలు ప్రకటించాయి. వచ్చే ఏడాది చివరి నాటికి కంబదూర్ వరకు రైలు నడుపుతామని రైల్వే ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. దీనికోసం ఈనెల 19న సీఆర్ఎస్ అధికారులు వచ్చి రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం వరకు పనులను పరిశీలించి పచ్చజెండా ఊపడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రైల్వే స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. ఫ్లాట్ ఫారం నీటి సౌకర్యం, బెంచులు ఏర్పాటు చేశారు. టికెట్ బుకింగ్ కౌంటర్ పనులు జరుగుతున్నాయి.

### *30న ముఖ్యమంత్రి చేతుల మీదుగా..*

ఈనెల 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్‌ప్రభు విజయవాడలో రిమోట్ ద్వారా రైలును ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాయదుర్గంలో రైలు ప్రారంభించడానికి ప్రభుత్వ ఛీఫ్ విప్ కాలవ శ్రీనివాసులు, మంత్రి పరిటాల సునీత, ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిలను ఆహ్వానించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రజాప్రతినిధులు జెండా ఊపి రైలును ప్రారంభిస్తారు. రోజుకు రెండు సార్లు రైలు కళ్యాణదుర్గానికి వచ్చి వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. సమయాల గుర్తించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం